నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 26 నవంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

అడ్డాకులలో జాతీయ రహదారిపై బారులుదీరిన పత్తి వాహనాలు

పత్తి రైతుల పడిగాపులు

- హైవేపై భారీగా నిలిచిన వాహనాలు

- కొను గోళ్లు లేక కేంద్రాల వద్ద నిరీక్షణ

మూసాపేట(అడ్డాకుల), నవంబర్ 25 : పత్తి కొను గోళ్లు చేయకపోవడంతో రైతులు మూడు రోజులుగా అవస్థలు పడుతున్నారు. అడ్డాకుల మండలంలోని ఎస్ఎస్వీ కాటన్ మిల్లు వద్ద ఏర్పాటు చేసిన కేంద్రానికి శనివారం రైతులు పత్తి లోడుతో వచ్చారు. అప్పటి నుంచి కొనుగోళ్లు చేయకపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. మిల్లు వద్ద నుంచి జాతీయ రహదారిపై వాహనాలు బారులు దీరాయి. శుక్రవారం కొను గోలు చేసి సాయంత్రం నుంచి నిలిపివేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం వరకు కొనుగోలు కేంద్రం తెరవకపోవడంతో అన్నదాతలు అక్కడే నిరీక్షిస్తున్నారు. ఆరుగాలం పండించిన పంటను అమ్ముకోవ డానికి అన్న దాతలు పడుతున్న తిప్పలు వర్ణణా తీతం.

దీక్షాదివస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

29న బీఆర్ఎస్ దీక్షాదివస్

- ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాం
- నేడు సన్నాహక సమావేశం
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 25 : ఈ నెల 29న నిర్వహించే దీక్షదివస్‌ను ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్షదివస్‌కు సంబంధించిన ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడతూ.. తెలంగాణ స్వరాష్ట్రం కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షను దీక్షదివాస్‌గా బీఆర్ఎస్ జరుపుకొంటుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అప్పట్లో కేసీఆర్ దీక్షకు దిగిరాక తప్పలేదని.. డిసెంబర్ 9న తెలంగాణ ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనీ వివరించారు. మంగళవారం దీక్షదివస్‌కు సంబంధించి మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, పార్టీ ముఖ్యనేతలు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పార్టీ క్యాడర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి వెంట జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజు, జడ్చర్ల నాయకులు నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అన్వర్, భాస్కర్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

రాబంధులా కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనాలి
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తాడూరు, నవంబర్ 25 : రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం రాబంధులా మారిందని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తాడూరు మండలంలోని ఇంద్రకల్ సమీపంలో మణికంఠ జిన్నింగ్ మిల్ వద్ద మర్రి వెళ్తుండగా.. రైతులు ఆయన కారును నిలిపి పత్తి కొను గోలు చేయడంలేదని వివరించారు. కష్టపడి పండించిన పంటను అమ్మేందుకు కొద్దిరోజులుగా పడుతున్న బాధలను రైతులు తెలిపారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ రైతులు తెచ్చిన పత్తిని వెంటనే అన్‌లోడ్ చేయాలన్నారు. సీసీఐ అధికారులతో మాట్లాడి కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. మద్దతు ధర చెల్లించకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్ వెంటనే స్పందించి సీసీఐ కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఓవైపు పండించిన పంటలను అమ్ముకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా ప్రభుత్వం గాలికొదిలేశిందని ధ్వజమెత్తారు. ఈ సమయంలో విజయోత్సవ సంబురాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, పదేండ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేసీఆర్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులతోపాటు, సబ్బండ వర్గాలు ఇక్కట్లు పడుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే సమీక్ష చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అందరి పత్తిని కొనుగోలు చేయాలి..

రైతులందరి పత్తి పంటను సీసీఐ ద్వారానే కొను గోలు చేయాలని సీసీఐ అధికారి దుబేకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఫోన్లో సూచించారు. ఈ సంవత్సరం వర్షాలు అధికంగా పడ్డాయని, చాలామంది రైతులకు సంబంధించిన పత్తి పంటలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. అందువల్ల పత్తి కొంత దెబ్బతిన్నదని.. ఈ విషయంలో రైతులకు అన్యాయం జరగకుండా సీసీఐ ద్వారానే కొను గోలు చేయాలని కోరారు. నష్టపోయిన రైతులను నాణ్యత, తేమ పేరుతో మద్దతు ధర ఇవ్వకుంటే రైతుల కష్టం వృథా అవుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు నష్టం జరిగితే.. వారు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని స్థితిలో ఉన్నారన్నారు. అందువల్ల నాణ్యత, తేమకు సంబంధం లేకుండా అందరి రైతులకు సంబంధించిన పత్తి పంటను సీసీఐ కొనాలని సూచించారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

గ్రామాలను అభివృద్ధి చేస్తా..

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 25 : నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మానవపాడు, జల్లాపురం, బోరవెల్లి, మద్దూరు, పెద్ద ఆముదాల పాడు, అమరవాయి, శ్రీనగర్, కొర్వి పాడు, పెద్ద పోతుల పాడు, ఏ బూడిద పాడు, బొంకూరు, మెన్ని పాడు ఇతర గ్రామాలకు చెందిన 29మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.7.62 లక్షల చెక్కులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సత్యారెడ్డి, మానవ పాడు మాజీ ఎంపీపీ అశోక్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, గొల్ల మొక్రా మడు, కర్ణసింహారెడ్డి, సూర్యవర్ధన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిర్బంధం మధ్య సాగుతున్న అంతిమ యాత్ర, (ఇన్‌సెట్లో) సాయిరెడ్డి (ఫైల్)

- మౌన రోధనలతో సాయిరెడ్డికి వీడ్కోలు
- కొండారెడ్డిపల్లికి వచ్చే రోడ్లన్నీ మూసివేసిన పోలీసులు
- సీఎం ఇంటి ముందు వెళ్లే దారి కూడా క్లోజ్
- సాయిరెడ్డిని కడసారి చూసేందుకు తీవ్ర ఇబ్బందులు
- భయంతో ఇండ్లకే పరిమితమైన గ్రామస్తులు
- మీడియా, రాజకీయ నాయకులకూ నిరాకరణ

అష్టదిగ్బంధంలో అంతిమయాత్ర

మహబూబ్‌నగర్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అధికారం మళ్లీ రాక్షసానందం పొందింది. సాయిరెడ్డి అంతిమయాత్రపై నిర్బంధం విధించింది. గ్రామ సరిహద్దులను బారికేడ్లు వేసి మూయించింది. పోలీసులను అడ్డుగోడలుగా నిలిపింది. దాదాపు 14 ఏండ్ల పాటు గ్రామానికి సర్పంచ్‌గా పనిచేసి 85 ఏండ్ల వయస్సులో అధికార వారసత్వం బెదిరింపులు, దాడులకు తాళలేక ఆత్మాభిమానంలో జీవం చాలక తనువు చాలించిన పాంకుంట్ల సాయిరెడ్డి అంతిమ సంస్కారాలు అధికారం విధించిన ఆంక్షల మధ్య సాగాయి. సాయిరెడ్డిలో ప్రాణం తీసేవరకు అధికారం సాగించిన దౌర్యన్యకాండ.. ఆయనను గౌరవంగా సాగనంపే అంతిమ సంస్కార కార్యక్రమాలకు కూడా తమ వికృత రూపాన్ని చవిచూపించింది. అందరికీ సుపరిచితుడై, గ్రామస్తుల తలలో నాలుకలా మెలిగి, కష్టసుఖాల్లో పాలుపంచుకున్న మాజీ సర్పంచ్ సాయిరెడ్డిని కడసారి చూడాలనుకున్న గ్రామస్తులు.. అధికారం విధించిన నిర్బంధంతో ఇండ్ల నుంచి బయటకు రాలేదు. కడుపు పుట్టిన పిల్లలు, సోదరులు, బంధువులు అంతిమయాత్రలో వెంటరాగా.. నిర్బంధానికి, అవమాన భారానికి ఇక సెలవంటూ సాయిరెడ్డి పార్థివ దేహం కట్టెల్లో కాలిపోయింది.

నాలుగురోజులుగా మార్చురీలో..

ఈనెల 22వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాంకుంట్ల సాయిరెడ్డి (85) సీఎం రేవంత్‌రెడ్డి సోదరుల వేధింపులు, దాడులకు తాళలేక పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సాయంత్రం 5 గంటలకు కల్వకుర్తి పట్టణం రఘుపతిపేట చౌరస్తా సమీపంలో విగతజీవిగా ఉన్న సాయిరెడ్డిని కల్వకుర్తి దవాఖానకు తీసుకొచ్చారు. సాయిరెడ్డి చనిపోయాడని డాక్టర్లు చెప్పడంలో సాయిరెడ్డి భౌతికకాయాన్ని మార్చురీలో ఉంచారు. సాయిరెడ్డి పెద్ద కొడుకు వెంకట్‌రెడ్డి తన కూతురు ఇంటికి అమెరికా వెళ్లడంతో ఆయన వచ్చే వరకు సాయిరెడ్డి భౌతికకాయాన్ని మార్చురీ గదిలో ఉంచాలని బంధువులు నిర్ణయించారు. ఆ రోజు నుంచి సోమవారం వరకు మార్చురీలోని ఫ్రీజర్‌లో ఉన్నది. నాలుగు రోజులుగా దవాఖానలో పోలీసులు పహరా కాస్తూనే ఉన్నారు. సాయిరెడ్డి ఆత్మహత్యకు కారణమైన రేవంత్‌రెడ్డి సోదరులపై బీఎన్ఎస్ 108సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ అగ్రనాయకత్వంతో పాటు జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు పలువురు డిమాండ్ చేశారు.

నిర్మానుష్యంగా ఉన్న సాయిరెడ్డి ఇల్లు

సోమవారం తెల్లవారుజామునుంచి..

ఆదివారం రాత్రి సాయిరెడ్డి కుమారుడు అమెరికా నుంచి తిరిగొచ్చాడు. నేరుగా కల్వకుర్తి దవాఖానలోని మార్చురీ వద్ద తండ్రి భౌతికకాయాన్ని చూసి కన్నీళ్లు పెట్టుకున్నాడు. తెల్లారిన తర్వాత తండ్రి భౌతికకాయానికి పోస్టుమార్టం చేయించి అంతిమ సంస్కారం కోసం కొండారెడ్డిపల్లికి తీసుకొస్తామని బంధువులకు చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. ఇదిలా ఉంటే సోమవారం తెల్లవారుజామున 5 గంటల వరకే పోలీసులు తమకు వచ్చిన ఆదేశాలను పాటించారు. తెల్లారిన తర్వాత వెంకట్‌రెడ్డి దవాఖానకు వచ్చే వరకే పోలీసులు పోస్టుమార్టం చేయించారు. మేం రాక ముందే పోస్టుమార్టం ఎలా నిర్వహిస్తారని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వెంకట్‌రెడ్డిని సముదాయించడంతో శాంతించారు. భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో కొండారెడ్డిపల్లికి తరలించారు.

5 గంటలకే కొండారెడ్డిపల్లి అష్టదిగ్బంధం

ఉదయం 5గంటల నుంచి కొండారెడ్డిపల్లి అష్టదిగ్బంధనం చేశారు. పెద్దసారు ఆదేశాలతో పోలీసులు గ్రామ సరిహద్దులను బారికేడ్లతో మూసివేశారు. గ్రామంలోకి వచ్చే అన్ని దారుల వద్ద పోలీసు బందోబస్తు ఉంచారు. గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిముందు నుంచి ఎవ్వరూ వెళ్లకుండా బారికేడ్లు వేసి బ్లాక్ చేసి పోలీసులు పహారా కాస్తున్నారు. రాజకీయ నాయకులు, మీడియా, కొత్త వ్యక్తులు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. సాయిరెడ్డి బంధువులమని చెబితే.. పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాత ఊర్లోకి పంపించారు. అనుమానం వస్తే వెనక్కి పంపించారు. బంధువులను కూడా రేవంత్‌రెడ్డి ఇంటిముందు నుంచి వెళ్లే దారినుంచి కాకుండా తుమ్మలపల్లి నుంచి పంపించారు. దీంతో సాయిరెడ్డిని కడసారి చూసేందుకు బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గ్రామస్తుల్లో భయం.. భయం

తమ గ్రామానికి ఏండ్లుగా సర్పంచ్‌గా సేవలందించి, తమ కష్టసుఖాల్లో పాలు పంచుకున్న సాయిరెడ్డిని అంతిమంగా చూసుకుందామని బలంగా ఉన్నా.. అధికారం పెట్టిన భయానికి ఇండ్ల నుంచి కదల్లేక పోయాం. సాయిరెడ్డి ఇంటి వద్దకు వెళ్తే ఏం నింద మోపుతారో ఎలాంటి ఇబ్బందులకు గురిచేస్తారోనన్న భయం గ్రామస్తుల కండ్లల్లో కనిపించింది. ఒకరిద్దరికి ఫోన్ చేసి గ్రామంలో ఏం జరుగుతుందని వాకబు చేస్తే.. మాకేం తెలియదన్న బాధ వుల వద్దకు వెళ్లామని సమాధానమిచ్చారు. సాయిరెడ్డిని కడసారి చూసుకుని అంతిమ యాత్రలో పాల్గొనేందుకు అధికారం ఆంక్షలు విధించినా.. బంధువులు పెద్ద సంఖ్యలో వచ్చారు. గ్రామస్తులు ఇండ్లకే పరిమితమయ్యారు.

గ్రామానికి వెళ్లకుండా పోలీసుల మోహరింపు

మౌనరోధనల మధ్య సాయిరెడ్డి అంతిమ యాత్ర

బంధువుల, ఆప్తుల, కడుపున పుట్టిన వారి మౌన రోదనల మధ్య సాయిరెడ్డి అంతిమ యాత్ర సాగింది. వారి వ్యవసాయ పొలంలో సాయిరెడ్డి భౌతిక కాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. సాయిరెడ్డి పెద్ద కొడుకు వెంకట్‌రెడ్డి చితికి నిప్పంటించాడు. ఆప్తులు, బంధువులు సాయిరెడ్డి మంచితనాన్ని గుర్తు చేసు కొని కన్నీళ్లు పెట్టుకున్నారు. అధికారం ఉన్నంత మాత్రాన నిజాలు మాట్లాడితే హింసపెడ తారా.. పండు ముదుసలి అని చూడకుండా వేధింపులకు గురిచేసి ప్రాణాలు తీసుకునే వరకు వెంటపడు తారా అంటూ బాధను వ్యక్తం చేశారు.

సాయిరెడ్డి ఆత్మహత్యతో రగిలిపోతున్న కొండారెడ్డిపల్లి

సాయిరెడ్డి ఆత్మహత్యతో సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లి రగిలిపోతుంది. ఊరి మంచి కోరే వ్యక్తిని ఆత్మహత్య చేసుకునేవరకు వెంటాడిన అధికారంపై లోలోపల మండిపోతుంది. ఎప్పుడు వీరిదే అధికారం ఉండదు కదా.. అధికారం పోయిన రోజు వీళ్ల బతుకులను చూస్తామనే రీతిలో గ్రామస్తులు భావిస్తున్నారు. గ్రామానికి చెందిన రెడ్డి, బీసీ, ఎస్సీలు 90శాతాని కైగా అధికారంపై ఆగ్రహంగా ఉన్నారు. సమయం వచ్చినప్పుడు ఆగ్రహజ్వాల మహాజ్వాలగా మారి అధికారాన్ని దహించి వేస్తుందనడంలో సందేహమే లేదు.

కొల్లాపూర్ : ముక్కిడిగుండం జీపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వృద్ధులు, ధన్వాడలో రోడ్డుపై నిరసన తెలుపుతున్న వృద్ధులు

పింఛన్ల కోసం వృద్ధుల నిరసన

- కేసీఆర్ సర్కారు దిగాక పత్తాలేని 'ఆసరా'
- కొసరు కూడా మింగేస్తున్నారని ఆవేదన

కొల్లాపూర్, నవంబర్ 25 : మా ఇంటి పెద్ద కొడుకు కేసీఆర్ దిగిపోయాక మాకు పింఛన్లు సరిగ్గా రావడంలేదని వృద్ధులు వాపోతున్నారు. గతంలో ప్రతినెలా మొదటి వారంలోనే పింఛన్లు వచ్చేవని.. ఇప్పుడు నెలాఖరు వచ్చినా పింఛన్లు రావడం లేదని వృద్ధులు ఆరోపిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని ముక్కిడి గుండం జీపీ కార్యాలయం వద్ద సోమవారం పింఛన్లు పంపిణీ చేయాలని గ్రామానికి వందమంది వృద్ధులు నిరసన వ్యక్తం చేశారు. పింఛన్లు రాక పోవడంతో సుస్తయితే గోళి బిళ్లలకు పైసలు లేవని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రూ.2016 బదులు రూ.2వేలు మాత్రమే ఇస్తూ కొసరు మింగుతున్నారన్నారు. ఈ సందర్భంగా సీపీఎం గ్రామ కార్యదర్శి అశోక్ వృద్ధులతో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

రోడ్డెక్కిన వృద్ధులు

ధన్వాడ, నవంబర్ 25 : బీఆర్ఎస్ ప్రభుత్వంలో వృద్ధులకు నెలనెలా సక్రమంగా పింఛన్లు అందించేవారని.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పింఛన్ కోసం పడిగాపులు పడాల్సి వస్తుందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో పింఛన్ డబ్బులు పంపిణీ చేయాలని కోరుతూ రోడ్డెక్కారు. ప్రతినెలా పింఛన్ డబ్బులు 18నుంచి 20వ తేదీ వరకు పోస్టాఫీస్‌లో ఇచ్చేవారని.. ఈనెల 25వ తేదీ వచ్చినా మాకు పింఛన్ డబ్బులు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. అనంతరం పోలీసులు చేరుకొని వృద్ధులను సముదాయించి రెండు రోజుల్లో పింఛన్ డబ్బులు ఇచ్చేవిధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో వృద్ధులు శాంతించారు.

దివ్యాంగుల పింఛన్ పెంచి ఇవ్వాలి

నారాయణపేట, నవంబర్ 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ మేరకు దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు పెంచి ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షురాలు రాధమ్మ, ప్రధాన కార్యదర్శి కాశప్ప డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11నెలలు దాటినా.. పింఛన్ పెంచకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఓవైపు పింఛన్ ఇచ్చేందుకు డబ్బులు లేవని చెబుతూనే.. మరోవైపు కమీషన్లు వచ్చే ప్రాజెక్టులకు రూ.లక్షల కోట్లు ఎలా కేటాయిస్తారన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 34 ఎందుకు అమలు చేయడం లేదన్నారు. వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో 5శాతం నిధులు కేటాయించాలన్నారు. జిల్లా స్థాయిలో 3 నెలలకు ఒకసారి జరగాల్సిన కో ఆర్డినేషన్ సమావేశం ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. అనంతరం డీటీ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా నాయకులు కృష్ణ, వెంకటేశ్, రవి, రాజు, నారాయణమ్మ, లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, రంగయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

నిరసనలో మాట్లాడుతున్న రాధమ్మ

కలెక్టరేట్ ఎదుట ధర్నా

నాగర్‌కర్నూల్, నవంబర్ 25 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.6వేల పింఛన్ అందించాలని వికలాంగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ను వికలాంగుల సంఘం సభ్యులు సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా పింఛను పెంచి ఇవ్వడంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం ఇస్తున్న పింఛన్ సరిపోవడం లేదని, వికలత్వంతో ఏం పనులు చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా పింఛన్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య, ఉపాధ్యక్షుడు ఆనంద్, అంజి, స్వామి, శ్రీనివాసులు, అలివేలు, నిరంజన్, సుగుణమ్మ పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వికలాంగులు

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

నాగర్‌కర్నూల్, నవంబర్ 25 : కాంట్రాక్టు ఏఎన్ఎంలకు రాత పరీక్ష నిర్వహించకుండా రెగ్యులర్ చేయాలని మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫసియోద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023లో 7716 జీవోను జారీ చేసి ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం పూనుకున్నదని, కానీ నేటికీ ఆ కమిటీ ఎప్పుడు కూడా సమావేశం కాలేదని, దీంతో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. సర్వీస్ వెయిటేజ్‌లో 50 మార్కులు కలపాలని, వయోపరిమితి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎక్స్‌ఆఫీషియో హెల్త్ ఇన్సూరెన్స్ చేయించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జనాభా ప్రాతిపదికన సబ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సుగుణ, కృష్ణవేణి, సౌమ్య, వనజ, అరుణ, యాదమ్మ, లక్ష్మి, మంజుల, సరస్వతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పర్వతాలు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

వరికుప్పలను తొలగిస్తున్న రైతు, (ఇన్‌సెట్లో) బోల్తాపడిన కారు

వరికుప్పలపై వెళ్తూ కారు బోల్తా

వంగూరు, నవంబర్ 25 : రోడ్డుపై వేసిన వరికుప్పలపై నుంచి వెళ్తూ ప్రమాదవశాత్తు కారు బోల్తా పడగా ఒకరు గాయపడిన ఘటన మండలంలోని డిండిచింతపల్లి శివారులో సోమవారం చోటుచేసుకున్నది. వివరాలిలా.. మండలంలోని తిప్పారెడ్డిపల్లికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ రేణయ్య మిట్టసద గోడులో నడుస్తున్న విద్యుత్ పనుల కోసం విద్యుత్ సామగ్రిని తీసుకొని కారులో వెళ్తున్నాడు. డిండిచింతపల్లికి చెందిన కుమ్మరి మల్లయ్య వరి కుప్పలను నూర్పిడి కోసం సింగిల్ రోడ్డుపై రెండు ఫీట్ల ఎత్తులో ఉంచాడు. కారులో వెళ్తున్న రేణయ్య వరి కుప్పలను చూసి బ్రేక్ వేయడంతో కుప్పలపై జారి 100 ఫీట్ల దూరంలో గాల్లోకి లేచి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో రేణయ్య తల, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చూసి పోలీసులకు సమాచారమందించి రేణయ్యను ఓ ప్రైవేట్ దవాఖానకు, కారును షెడ్డుకు తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత కాంట్రాక్టర్ తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి బాధ్యుడిపై చర్యలు తీసుకోనున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.